

టన్ను చీనీ రూ.22 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.22 వేలు ప్రకారం ధర పలికాయి.



క్రీస్తు త్యాగాలకు ప్రతీక గుడ్‌ఫ్రైడే

క్రైస్తవ సమాజంలో అత్యంత ప్రత్యేకమైన రోజుగా పరిగణించబడే గుడ్ ఫ్రైడే రానే వచ్చింది. జిల్లాలోని ప్రార్థనామందిరాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి.

10లో

గరిష్టం/కనిష్టం
40.7°/22.9°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం కొనసాగుతోంది. గంటకు 8 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

అమ్మో చిరుత!

కళ్యాణదుర్గం: మండలంలోని బోరంపల్లి–ముదిగల్లు గ్రామాల మధ్య రెండు రోజులుగా చిరుత సంచరిస్తోంది. సమీపంలోని మొక్క జొన్న, మామిడి, అరటి తోటల్లో తిరుగుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో ఆయా గ్రామాల రైతులు రాత్రిళ్లు పొలాలకు వెళ్లేందుకు బిక్కుబిక్కుమంటున్నారు. చిరుత సంచారంపై రంగారెడ్డి, జగదీష్, మంజు, రమేష్, రాజు తదితరులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ప్రొటెక్షన్ వాచర్లు చిరుత జాడ కోసం అన్వేషిస్తున్నట్లు తెలిసింది.

విద్యార్థిని బలిగొన్న విద్యుదాఘాతం



కార్తీక్ (ఫైల్)

గుమ్మఘట్ట: విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి చెందిన ఘటన మండలంలోని గొల్లపల్లి గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. గొల్లపల్లికి చెందిన తిప్పేస్వామి, ధనలక్ష్మీ దంపతులు. వీరికి ఒక కుమారుడు కార్తీక్ (16), కుమార్తె పూజ సంతానం. తిప్పేస్వామి తన నాలుగెకరాల పొలంలో మొక్కజొన్న, వరి పంట సాగు చేస్తున్నాడు. గురువారం మొక్కజొన్న పంటకు నీరందించేందుకు కార్తీక్ వెళ్లాడు. పొలంలో మోటార్ ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. చుట్టుపక్కల పొలాల రైతుల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న తల్లిదండ్రులు కుమారుడి మృతదేహం వద్ద గుండెలవిసేలా రోదించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విద్యా సంస్థల్లో ఈగల్ క్లబ్‌లు

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యా సంస్థల్లో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. మాదక ద్రవ్యాలను అరికట్టడంలో భాగంగా 'ఎడ్యుకేట్, అడ్వకేట్, గార్డ్, లీడ్, ఎంపవర్' పేరుతో యాంటీ–నార్కొటిక్ క్లబ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డీఈఓ తెలిపారు.

క్రీడాకారులు నమోదు చేసుకోండి



అనంతపురం: అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ 2025–26 క్రికెట్ సీజన్ కోసం రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి.అండర్–12, 14, 16, 19, 23, సీనియర్ కేటగిరీలో ఆసక్తి గల బాలురు, బాలికలు ఇద్దరూ తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఏడీసీఏ జిల్లా కార్యదర్శి వి.భీమలింగా రెడ్డి తెలిపారు. ఏప్రిల్ 20 నుంచి 30వ తేదీలోపు అనంతపురం స్పోర్ట్స్ అకాడమీ కార్యాలయంలో దరఖాస్తులు పొందవచ్చని పేర్కొన్నారు. ఒరిజినల్ ఫారం 5, పుట్టిన తేదీ సర్టిఫికెట్, ఆధార్, స్టడీ సర్టిఫికెట్‌తో తాజా ఫొటో, తండ్రి, లేదా తల్లి ఓటర్ ఐడీతో ఫారాన్ని రిజిస్టర్ చేసుకోవాలని కోరారు.

అర్బన్‌లో అసమ్మతి సెగలు

- పట్టుమని పది నెలల్లోనే టీడీపీకి దూరమైన 'అనంతపురం' నేతలు
- తాజాగా జరిగిన క్లస్టర్ ఇన్‌చార్జ్‌ల సమావేశానికి డుమ్మా
- అధిష్టానం సీరియస్‌గా ఉందని హెచ్చరించినా బేఖాతరు
- ఎన్నికల ముందు ఊరించి ఉసూరుమనిపించారంటూ ఆవేదన
- అన్ని ఆదాయ వనరులూ ఒకరికే చెందుతున్నాయని నిట్టూర్పు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: అనంతపురం అర్బన్ నియోజకవర్గ టీడీపీలో అప్పుడే అసమ్మతి సెగలు రేగాయి. కూటమి సర్కారు ఏర్పడి పట్టుమని పది నెలలు కూడా కాకుండానే టీడీపీకి చెందిన ముఖ్య నాయకులు అసంతృప్తితో రగిలిపోతున్నారు. గత రెండు మాసాలుగా కేడర్‌కూ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కూ ఎడమొహం పెడమొహం అన్నట్లుగా ఉందని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. కేడర్‌లో ఏ ఒక్కరికీ పనులు కావడం లేదని, అన్నీ ఎమ్మెల్యే మనుషులకే దక్కుతున్నాయని, ఈ మాత్రం దానికి తామెందుకు పార్టీ కోసం కష్టపడాలని అసమ్మతి నేతలు వాదిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల సభ్యత్వ నమోదు కూడా తూతూ మంత్రంగా జరిగినట్లు తెలిసింది.

సమావేశానికి రాంరాం..

రెండు రోజుల క్రితం అనంతపురం టీడీపీ పరిశీలకుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌ల సమావేశం జరిగింది. ఇందుకు అర్బన్ నియోజకవర్గ ముఖ్య నాయకులెవరూ హాజరుకాలేదు. మాజీ మేయర్ స్వరూప, సుధాకర్ నాయుడు, ఆదెన్న, బుగ్గయ్య, రాయల్‌మురళి, జేఎల్ మురళి వంటి వారు ఆ వైపు చూడలేదు. వీళ్లందరూ ఇటీవలి వరకూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న వారే. అలాంటి నేతలు నేడు ఎమ్మెల్యే తీరుపై మండిపడుతున్నారు.

మార్కెట్ యార్డు చైర్మన్‌గిరీ.. అన్ని చోట్లా వారికే..!

అనంతపురం మార్కెట్ యార్డ్ తనకే దక్కుతుందని టీడీపీకి చెందిన ఓ మహిళ ప్రచారం చేసుకుంటోంది. ఇప్పటికే సంబంధిత ప్రజాప్రతినిధికి రూ.65 లక్షలు ఇచ్చినట్టు ప్రచారం చేస్తున్నారు. సదరు మహిళ కమ్మ సామాజికవర్గానికి చెందిన వారు. ఇప్పటికే రాప్తాడు మార్కెట్ కమిటీ చైర్మన్ గిరీని కమ్మ సామాజిక వర్గ నేతకే కట్టబెట్టారు. ఈ క్రమంలో అనంతపురంలో కూడా అదే సామాజిక వర్గ నేతకు పదవి ఎలా అప్పజెబుతారని కేడర్ ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ ఆ మహిళకు ఇవ్వకపోతే తన సమీప బంధువు కోనంకి గంగారాంకు పదవి కట్టబెట్టాలని ఎమ్మెల్యే యోచిస్తున్నట్లు తెలిసింది. గంగారాం కూడా కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారే కావడంతో కాపు, ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన వారు గుర్రుమంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తాము ఒప్పుకునేది లేదని బహిరంగంగానే స్పష్టం చేస్తున్నారు. దీంతో పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. ఇదిలా ఉండగా దగ్గుపాటి ప్రసాద్‌కు సొంత పార్టీలోనే బద్ధశత్రువుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి వచ్చే నెల నుంచి జనంలోకి వెళ్లాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది.

ఊరించి ఉసూరుమనిపించారు..

'ఎన్నో ఏళ్లుగా కష్టపడ్డాం.. ఎన్నికల ముందు మాకు ఎన్నో హామీలిచ్చారు. పదవులు ఇస్తామన్నారు.. ఈ క్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త వ్యక్తి అయినా దగ్గరుండి గెలిపించాం.. కానీ ఇప్పుడు పదవులూ లేవు, ఆదాయమూ లేదు' అంటూ ఓ టీడీపీ నాయకుడు ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం కష్టపడ్డామని.. అప్పులు చేసి ఖర్చు పెడితే ఇప్పుడా అప్పులకు వడ్డీలు కడుతున్నామని కమ్మ సామాజిక వర్గానికే చెందిన ఒక నాయకుడు వాపోయారు. 'ఆదాయమొచ్చే పనులు ఎమ్మెల్యేకు, కష్టం మాకా' అంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. అందుకే ఎమ్మెల్యే పాల్గొంటున్న సమావేశాలకు వెళ్లడం లేదని మరో నాయకుడు తెగేసి చెప్పారు. కేడర్ ఎవరూ ఇష్టంగా పనిచేసేందుకు ముందుకు రావడం లేదని, ఎమ్మెల్యే వ్యవహార శైలే కారణమని కాపు సామాజిక వర్గ నేత చెప్పారు.

అనంతపురం నుంచి బెంగళూరుకు రైలు

- కొత్తగా ఏడు స్టేషన్లలో స్టాపింగ్



అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా ప్రజల చిరకాల వాంఛ నెరవేరబోతోంది. శ్రీసత్యసాయి జిల్లా ప్రశాంతి నిలయం నుంచి బెంగళూరు వరకు నడిచే మెమూ రైలును అనంతపురం వరకు పొడిగించారు. దీంతో పాటు అనంతపురం నుంచే బెంగళూరుకు బయలుదేరేలా దక్షిణ మధ్య రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఉత్తర్వులు కూడా జారీ చేయడంపై అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అనంతపురం–బెంగళూరు మధ్య ప్రత్యేక రైలు నడపాలంటూ ప్రజాప్రతినిధులు, అధికారులను ఎప్పటి నుంచో ఈ ప్రాంతవాసులు కోరుతూ వచ్చారు. వారి విజ్ఞప్తిని అధికారులు ఎట్టకేలకు మన్నించారు. త్వరలోనే రైలు అనంతపురం నుంచి బయలుదేరేలా ప్రణాళిక రచించారు. ప్రశాంతి నిలయం నుంచి బెంగళూరు మధ్య ఇప్పటి వరకు ఉన్న స్టాపింగులతో పాటు అదనంగా ప్రసన్నాయపల్లి, జంగాలపల్లి, చిగిచెర్ల, బాసంపల్లె, కొత్తచెరువు, విదురాశ్వర్థం, సోమేశ్వరలో స్టాపింగ్ సదుపాయం కల్పించారు. సామాన్య ప్రయాణికులతో పాటు విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులకు రైలు ఎంతో సౌకర్యంగా ఉండనుంది. అతి త్వరలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి చేతుల మీదుగా అనంతపురం నుంచి లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, అనంతపురం రైల్వే స్టేషన్ మేనేజర్ మాసినేని అశోక్ కుమార్ వేర్వేరుగా తెలిపారు. అనంతపురంలో మధ్యాహ్నం 2.10 గంటలకు బయలుదేరి రాత్రి 7 గంటలకు బెంగళూరు చేరుకునేలా షెడ్యూల్ రూపొందించారు.

బాధితులకు ఇదేనా మీరు చేసే న్యాయం?

- అధికారులను నిలదీసిన ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు
- ప్రత్యేక గ్రీవెన్స్‌లో 238 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో ఎస్పీ జగదీష్

అనంతపురం అర్బన్: 'మీకు ఎస్సీ, ఎస్టీలన్నా, వారి సమస్యలన్నా చిన్న చూపు. బాధితుల సమస్యలు పరిష్కరించడంపై శ్రద్ధ చూపరు. ఏళ్లు గడుస్తున్నా సమస్యలను పరిష్కరించడం లేదు' అంటూ అధికారులను సంఘాల నాయకులు నిలదీశారు. గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్‌లో కలెక్టర్ వి.వినోద్ కుమార్‌తో పాటు జిల్లా ఎస్పీ పి.జగదీష్, డీఆర్‌ఓ ఎ.మలోల, ఆర్‌డీఓ కేశవనాయుడు, డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్, సాంఘిక సంక్షేమశాఖాధికారి రాధిక, అదనపు ఎస్పీ డీవీ రమణమూర్తి, జేడీఏ ఉమామహేశ్వరమ్మ అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై మొత్తం 238 అర్జీలు అందాయి. ఒక బాధితురాలికి న్యాయం చేసే విషయంలో డీఆర్‌ఓతో ఎరికల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలా వీరా వాగ్వాదానికి దిగారు. నగర పరిధిలో నివాసముంటున్న ఎరికల కులానికి చెందిన మహిళ సామూహిక అత్యాచారానికి గురైందన్నారు. అప్పట్లో పోరాటం చేస్తే రూ. లక్ష ఆర్థిక సాయం అందించారన్నారు. జీఓ 95 ప్రకారం బాధితురాలికి ఐదు సెంట్ల స్థలం ఇవ్వాల్సి ఉందని, తొమ్మిదేళ్లుగా అర్జీలిస్తున్నా బాధితురాలికి న్యాయం చేయలేదన్నారు. ఈ విషయంలో ఆర్‌డీఓ, తహసీల్దారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకుంటానన్నారు.

వినతుల్లో కొన్ని...

- తమ భూమిని దౌర్జన్యంగా ఆక్రమించారంటూ కళ్యాణదుర్గం మండలం లక్ష్మీపురం ఎస్టీ కాలనీకి చెందిన వాలేనాయక్ ఫిర్యాదు చేశాడు. కంబదూరు మండలం పాలూరు గ్రామ పొలం సర్వే నంబరు 80–1లో 3.50 ఎకరాల భూమి తన తల్లి పేరిట ఉందని, ఈ భూమిని గ్రామంలోని ఒక వ్యక్తి, తహసీల్దారు కార్యాలయంలోని ఇద్దరు ఉద్యోగులు కలిసి ఆక్రమించారని తెలిపారు. దీనిపై ఆర్‌డీఓ, తహసీల్దారు, పోలీసులు భూమి హద్దులు వేసినా ఆక్రమణదారులు తొలగించారని, భూమిలోకి వస్తే చంపుతామంటూ బెదిరిస్తున్నారని వాపోయాడు.
- 20 నెలలుగా తనకు వేతనం అందడం లేదంటూ నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ ఉద్యోగి సూర్యనారాయణ విన్నవించాడు. డ్యూటీపై ఎక్కడా తిరగనివ్వడం లేదని, ఆఫీసులో కూర్చోబెడుతున్నారని వాపోయాడు.
- రుణానికి సంబంధించి సబ్సిడీ మంజూరులో అధికారులు జాప్యం చేస్తున్నారని యల్లనూరు మండలం పాతపల్లికి చెందిన పి.విజయ ఫిర్యాదు చేసింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రుణం మంజూరైందని, అయితే సబ్సిడీ మంజూరు క్రమంలో ఫైల్‌ను బ్యాంకుకు పంపకుండా ఎంపీడీఓ కార్యాలయ అధికారులు కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది.

భద్రతా ప్రమాణాలు పాటించాలి

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. మినీ కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో డిస్ట్రిక్ట్ క్రైసిస్ గ్రూప్, డిస్ట్రిక్ట్ ఇండస్ట్రియల్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆరు నెలలకోసారి మాక్ డ్రిల్ నిర్వహించాలన్నారు. రసాయనాలపై కార్మికులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

జిల్లా మినరల్ ఫండ్ ద్వారా తాగునీరు, విద్య, వైద్యానికి సంబంధించి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. ప్రధానమంత్రి ఖనిజ క్షేత్ర కల్యాణ యోజన (పీఎంకేకేకేవై)పై గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, హిందూపురం ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్రబాబు, జేసీ అస్మిత్‌రెడ్డి, దగ్గుపాటి ప్రసాద్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 31 నాటికి రూ.52.66 కోట్ల నిధులు నూతన పనులకు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇందులో నియోజకవర్గానికి రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల పనులు మంజూరు చేసేందుకు కమిటీ ప్రతిపాదన చేసిందని చెప్పారు. సమావేశంలో గనుల శాఖ డీడీ వెంకటేశ్వర్లు, తాడిపత్రి ఏడీ ఓబుళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల్లో డ్రోన్ సర్వే

- రాష్ట్రంలో పైలట్ గ్రామంగా ముకుందాపురం ఎంపిక



సిబ్బందికి శిక్షణనిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: పండ్ల తోటల్లో డ్రోన్ సర్వే నిర్వహించనున్నట్లు ఉద్యాన శాఖ అధికారి రత్నకుమార్ పేర్కొన్నారు. ఇందుకోసం రాష్ట్రంలోనే మొట్టమొదటిగా గార్లదిన్నె మండలంలోని ముకుందాపురాన్ని పైలట్ గ్రామంగా ఎంపిక చేశారన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో గురువారం ఉద్యాన శాఖ, ఎఫ్‌పీఓలు, ఏపీఎంఐపీ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని రైతులకు చేరువ చేయాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. 17 బృందాలు ముకుందాపురంలో చీనీ తోటలను సందర్శించి జీపీఎస్ ట్రాకింగ్ చేస్తాయన్నారు. చీనీ తోటలకు ఆశించే చీడపీడలు, యాజమాన్య పద్ధతులపై ఎప్పటికప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా విశ్లేషించి రైతులకు సలహాలు, సూచనలు అందిస్తాయన్నారు. శిక్షణ కార్యక్రమాన్ని 'జూమ్' ద్వారా ఏపీఎంఐపీ డైరెక్టర్ రఘునాథ్ రెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఫిరోజ్ ఖాన్, ఐటీ (ఇంటెలిజెన్స్) శ్రీహరి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ మైక్రో ఇరిగేషన్ అధికారులు మధు, గణేష్, నాగార్జున, ఎఫ్‌పీఓలు పాల్గొన్నారు.

గంజాయి మహమ్మారిని నిర్మూలిద్దాం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అడిషనల్ ఎస్పీ డీవీ రమణమూర్తి

అనంతపురం: గంజాయి మహమ్మారి నిర్మూలనకు సమష్టిగా పనిచేద్దామని అడిషనల్ ఎస్పీ డీవీ రమణమూర్తి పిలుపునిచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం వివిధ ప్రభుత్వ శాఖలు, ఎన్జీఓలతో అడిషనల్ ఎస్పీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గంజాయి రవాణా నిరోధానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించామన్నారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలకు అలవాటుపడిన వారి గుర్తింపునకు డోర్ టు డోర్ సర్వే చేయాలన్నారు. పోలీస్, ఎక్సైజ్, జిల్లా ఈగల్ సెల్, విద్యాశాఖ, గ్రామ, వార్డు సెక్రటరీలు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సీఐలు హరినాథ్, వెంకటేశ్ నాయక్, జయపాల్ రెడ్డి, జిల్లా ఈగల్ సెల్ ఆర్ఎస్ఐ హనుమంతు తదితరులున్నారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం



అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి

రొళ్ల: రత్నగిరిలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం జ్యోతుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రొళ్ల మండలం హనుమంతనపల్లి, వన్నారనపల్లి, హులీకుంట, దొమ్మరహట్టి, కొత్తపాళ్యం, కొడగార్లగుట్ట, కొత్తపాళ్యం తాండ, రొళ్లకొండ, అలుపనపల్లి, ఏ.వద్రహట్టి, దాసప్పపాళ్యం, క్యాతప్పపాళ్యం, వన్నప్పపాళ్యం, జీఎస్ పాళ్యం, బాజయ్యపాళ్యం, పి.గొల్లహట్టి, గొట్టుగుర్కి, రంగనపల్లి, వెంకటంపల్లి తదితర గ్రామాల్లో ఉత్సవాన్ని జరుపుకున్నారు. మహిళలు పెద్ద ఎత్తున జ్యోతులతో ఆలయానికి చేరుకొని అమ్మవారికి సమర్పించారు.



రత్నగిరిలో జ్యోతులతో ఊరేగింపుగా ఆలయానికి తరలివస్తున్న మహిళలు

కనెక్షన్ కింగ్‌లు!

- తారస్థాయికి విద్యుత్ అధికారుల అక్రమాలు
- ఇష్టారాజ్యంగా వసూళ్లు
- డబ్బు దండుకుని అక్రమంగా కనెక్షన్లు
- ఫైనలివ్వకుంటే అంతులేని జాప్యం



కళ్యాణదుర్గం రోడ్డు బాలాజీ విల్లాస్ వెనుక భాగంలో నాలుగేళ్ల క్రితం వెలసిన వెంచర్ ఇది. కళ్యాణదుర్గం రోడ్డుకు చెందిన ఓ బిల్డర్ ఇక్కడ కొన్ని ప్లాట్లు కొనుగోలు చేశాడు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు విద్యుత్ సర్వీస్ కోసం డీ–5 సెక్షన్‌కు వెళ్లి దరఖాస్తు చేసుకున్నాడు. వెంటనే విద్యుత్ శాఖ టౌన్ 2లో పని చేస్తున్న ఓ ఉన్నతాధికారి క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. వెంచర్‌కు అనుమతులు లేవు.. విద్యుత్ సర్వీస్ ఇచ్చేందుకు నిబంధనలు అనుమతించవని చెప్పారు. ఈ క్రమంలో ఉన్నతాధికారికి సదరు బిల్డర్ రూ.2 లక్షలకు పైగా ముడుపులివ్వగా.. వెనువెంటనే సర్వీస్ మంజూరు చేశారు. నారాయణపురంలో సైతం ఇలాగే ఓ వెంచర్ నిర్వాహకుడి నుంచి రూ.లక్షల్లో వసూలు చేసినట్లు తెలిసింది. అపార్ట్‌మెంట్లకు సైతం అనుమతుల నెపంతో ఆయన భారీగా వసూళ్లు చేస్తున్నట్లు విద్యుత్ శాఖలో చర్చ జరుగుతోంది.



ఈ చిత్రంలో కనిపిస్తున్న షూమార్టును అనంతపురం సుభాష్ రోడ్డులో ఇటీవలే ప్రారంభించారు. భవనానికి విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవడంతో టౌన్–1లో పని చేస్తున్న ఓ ఉన్నతాధికారి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 40 కిలోవాట్ల విద్యుత్ వాడకం ఉంటుందని, 63 కిలోవాట్ల సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాలని బిల్డింగ్ నిర్వాహకుడికి చెప్పారు. ఈ క్రమంలో నిర్వాహకుడు రూ.5 లక్షలకు పైగా చెల్లించగా.. వెంటనే సిటీమీటర్‌ను రిలీజ్ చేసి సర్వీస్ మంజూరు చేశారు. విద్యుత్ శాఖ నిబంధనల మేరకు ట్రాన్స్‌ఫార్మర్‌ను చార్జ్ చేసిన తర్వాతనే సర్వీస్ మంజూరు చేయాలి. అయితే ముడుపులు అందడంతో అవన్నీ గాలికి వెళ్లిపోయాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా ఇటీవల సుభాష్‌రోడ్డు, కమలానగర్ ప్రాంతాల్లో లో ఓల్టేజీ సమస్య తలెత్తుతుండటం గమనార్హం.

అనంతపురం టౌన్: విద్యుత్ శాఖ అధికారుల చేతివాటం తారస్థాయికి చేరింది. ముడుపులు ముట్టజెబితే తప్ప ముందుకెళ్లని పరిస్థితి నెలకొంది. స్వయంగా ఉన్నతాధికారులే వసూళ్లు చేస్తుండడంతో వారిని ఆదర్శంగా తీసుకుని కింది స్థాయి సిబ్బంది సైతం జేబులు నింపుకుంటున్నారు. అనంతపురం నగర పరిధి రోజు రోజుకూ విస్తరిస్తోంది. పెద్ద పెద్ద భవనాలు, వెంచర్లు, డూప్లెక్స్ ఇళ్ల నిర్మాణాలు సాగుతున్నాయి. ఇదే అదునుగా విద్యుత్ శాఖ అధికారులు వసూళ్లకు పాల్పడుతున్నారు. ముందు అనుమతుల పేరిట కొర్రీలు విధిస్తూ.. ముడుపులు అందగానే అన్నీ సక్రమంగా ఉన్నాయంటూ కనెక్షన్లు మంజూరు చేస్తున్నారు. డీ 2, డీ3 సెక్షన్లలో అపార్ట్‌మెంట్లను సైతం వదలడం లేదని తెలిసింది. 'మీరు 4 ఫ్లోర్లకు మాత్రమే అనుమతి తీసుకున్నారు.. ఇక్కడ మాత్రం 5 ఫ్లోర్లు నిర్మించారు.. 5వ ఫ్లోర్‌కు విద్యుత్ సర్వీసు ఇవ్వం' అంటూ బెదిరించడం.. డబ్బు అందగానే వాటికి సైతం సర్వీసు మంజూరు చేయడం షరామామూలుగా మారింది. కొన్ని ప్రాంతాల్లో అయితే ఆరుకు పైగానే సర్వీసులు మంజూరు చేస్తున్నట్లు తెలిసింది. ఇక.. 100 కిలోవాట్ల విద్యుత్ వాడకం ఉన్న అపార్ట్‌మెంట్లకు 60, 40 కిలోవాట్లకు మాత్రమే ఎస్టిమేషన్లు వేస్తున్నట్లు సమాచారం.

సంస్థపై పెనుభారం..

విద్యుత్ అధికారుల బాగోతంతో ఎస్పీడీసీఎల్ సంస్థపై అదనపు భారం పడుతోంది. ఇష్టారాజ్యంగా సర్వీసులు ఇస్తుండడంతో లో ఓల్టేజీ సమస్యలు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో సమస్యను అధిగమించేందుకు ఎస్పీడీసీఎల్ రూ.కోట్లు ఖర్చు చేస్తూ అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాల్సిన దుస్థితి నెలకొంది.



చర్యలు తీసుకుంటాం



విద్యుత్ సర్వీసుల మంజూరు కోసం వెంచర్ల నిర్వాహకుల నుంచి అక్రమంగా వసూళ్లు చేస్తున్న ఉద్యోగులపై విజిలెన్స్ విచారణ చేపడతాం. వాస్తవమని తేలితే చర్యలు తీసుకుంటాం. ట్రాన్స్‌ఫార్మర్లు చార్జ్ చేసిన తర్వాతే సిటీ మీటర్లు రిలీజ్ చేయాల్సి ఉంటుంది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించం.

– శేషాద్రిశేఖర్, ఎస్ఈ

క్లుప్తంగా

హోరీహోరీగా రాతిదూలం లాగుడు పోటీలు


పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: కాశిరెడ్డి నాయన నూతన ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా గుంతకల్లు మండలం పాతకొత్తచెరువు గ్రామంలో గురువారం గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన రాతి దూలం లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి 14 జతల దేశం ఎద్దులను పోటీలకు రైతులకు తీసుకువచ్చారు. కర్నూలు జిల్లా జొన్నగిరికి చెందిన రైతు హుసేనప్ప ఎద్దులు మొదటి స్థానంలో, డి.హీరేహాళ్ మండలం ఉద్యాల గ్రామ రైతు నరసింహులు ఎద్దులు ద్వితీయ స్థానంలో నిలిచాయి. తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన ఎద్దుల యజమానులను గ్రామ సర్పంచ్ మల్లికార్జున, మాజీ సర్పంచ్ రాజన్న, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు రంగనాయకులు, పరశురాముడు, వెంకటరాముడు, పందికోన శివ.. నగదు పురస్కారాలతో సత్కరించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

రాయదుర్గం: మండలంలోని కాశీపురం గ్రామానికి చెందిన రైతు కావలి ఎర్రిస్వామి (54)విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. గురువారం ఉదయం పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన ఎర్రిస్వామి.. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజులు ఎగిరిపోయినట్లుగా గుర్తించి, వాటిని వేస్తున్న క్రమంలో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉత్సాహంగా ఉరకలెత్తిన దున్నలు


రాతిదూలం లాగుతున్న దున్నపోతులు

కణేకల్లు: స్థానిక చిక్కణ్ణేశ్వర స్వామి ఉత్సవాల సందర్భంగా గురువారం నిర్వహించిన దున్నపోతుల రాతిదూలం పోటీలు ఆసక్తిగా సాగాయి. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం వేదిగా పోటీలు నిర్వహించారు. హోరాహోరీగా సాగిన పోటీల్లో రాతి దూలాన్ని లాగుతూ దున్నపోతులు ఉరకలేయడాన్ని చూసి ప్రజలు కేకలు, ఈలలతో హోరెత్తించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన పోటీలు సాయంత్రం 4 గంటలకు ముగిసాయి. రైతు కె.ముజ్జుకు చెందిన దున్నపోతులు 15 నిమిషాల వ్యవధిలో 2,608.10 అడుగుల మేర దూరాన్ని రాతిదూలాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. మరో రైతు తిప్పేష్‌కు చెందిన దున్నపోతులు ద్వితీయ స్థానంలో, రైతు జి.రిజ్వంత్‌కు చెందిన దున్నపోతులు మూడో స్థానంలో నిలిచాయి. విజేత దున్నల యజమానులను అభినందిస్తూ సర్పంచ్ దంపతులు నిర్మల, డాక్టర్ సోమన్నతో నగదు పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో కణేకల్లు మేజర్ పంచాయతీ ఈఓ ప్రసాద్, కణేకల్లు చెరువు సంఘం అధ్యక్షుడు బీటీ రమేష్, స్థానికులు లాలెప్ప, అనిల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట దగ్ధం


నిప్పంటుకుని దగ్ధమైన మొక్కజొన్న పంట

రాయదుర్గం టౌన్: మండలంలోని కదరంపల్లి గ్రామంలో రైతు కుమారస్వామి సాగు చేసిన మొక్కజొన్న పంట అగ్నికి ఆహుతైంది. గురువారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో శరవేగంగా మంటలు వ్యాపించి 9 ఎకరాల్లోని మొక్కజొన్న పంటను చుట్టుముట్టాయి. విషయం తెలుసుకున్న రైతు స్థానికుల సాయంతో మంటలు అదుపు చేశారు. ఈ లోపు 5 ఎకరాల్లోని పంట పూర్తిగా కాలిపోయింది. మరో రెండు రోజుల్లో మొక్కజొన్న కంకులు కోయాల్సి ఉండగా ఈ ఘటన జరగడంతో రూ.8 లక్షల మేర నష్టపోయినట్లు బాధిత రైతు వాపోయాడు.

రూ.10 లక్షల విలువైన బైక్‌ల స్వాధీనం

- ద్విచక్రవాహనాల చోరీ కేసులో ఆరుగురి అరెస్ట్


స్వాధీనం చేసుకున్న వాహనాలను చూపుతున్న పోలీసులు

బత్తలపల్లి: ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లే యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.10 లక్షల విలువైన 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. బత్తలపల్లి పీఎస్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను సీఐ ప్రభాకర్, ఎస్‌ఐ సోమశేఖర్ వెల్లడించారు. అనంతపురం నగరానికి చెందిన ప్రణయ్, ధనుష్, సిద్ధి వినయ్ వ్యసనాలకు బానిసలుగా మారి జులాయిగా తిరుగుతూ తమ జల్సాలకు అవసరమైన డబ్బు కోసం ద్విచక్ర వాహనాలను అపహరించడాన్ని పనిగా పెట్టుకున్నారు. ఈ క్రమంలో ముగ్గురు మైనర్లను కలుపుకున్నారు. వీరంతా కలసి ఓ ముఠాగా ఏర్పడి ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లి తక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకునేవారు. అనంతరం ఇతర రాష్ట్రాలకు చేరుకుని జల్సాలు చేసేవారు. ఈ క్రమంలో బత్తలపల్లిలోని జాతీయ రహదారి కూడలిలో గురువారం ఉదయం వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో రెండు ద్విచక్ర వాహనాలపై ఆరుగురు వెళుతుండగా స్థానిక పోలీసులు అడ్డుకుని విచారణ జరిపారు. ఆ సమయంలో వారు పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో అనుమానంతో అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. బత్తలపల్లి, ధర్మవరం, అనంతపురం నగర పరిధిలో అపహరించిన 11 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ దాదాపు రూ.10 లక్షలుగా ఉంటుందని నిర్ధారించారు. వీరిపై బత్తలపల్లిలో రెండు, ధర్మవరం టూ టౌన్ పరిధిలో మూడు కేసులు, అనంతపురంలో ఐదు కేసులున్నట్లు విచారణలో వెల్లడైంది. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మైనర్లను బాలుర పరివర్తన కేంద్రానికి తరలించారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన ఎస్‌ఐ సోమశేఖర్, సిబ్బందిని సీఐ ప్రభాకర్ అభినందిస్తూ రివార్డులను అందజేశారు.

ఈపీఎఫ్ కార్యాలయం ఎదుట కార్మికుల ధర్నా


నిరసన తెలుపుతున్న కార్మిక సంఘం నాయకులు, కార్మికులు

అనంతపురం సిటీ: స్థానిక రైల్వే స్టేషన్ ఎదుట ఉన్న ఈపీఎఫ్ కార్యాలయం వద్ద శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు గురువారం ధర్నా నిర్వహించారు. బకాయి వేతనాలు పీఎఫ్ ఖాతాల్లో జమ చేయకుండా కాంట్రాక్టర్లు తప్పుడు ఆరోపణలు చేయడం, వారికి అధికారులు వత్తాసు పలుకడాన్ని నిరసిస్తూ సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర నాయకత్వంలో పెద్ద సంఖ్యలో కార్మికులు ఆందోళనలో పాల్గొన్నారు. తమకు చెల్లించాల్సిన వేతన బకాయిలతో పాటు పీఎఫ్ డబ్బులు తమ ఖాతాల్లో జమ చేయాలని నినాదాలు చేశారు. నెలల తరబడి వేతనాలు చెల్లించకుండా అధికారులు, కాంట్రాక్టర్లు పరస్పరం నిందలు వేసుకుంటున్నారని మండిపడ్డారు. కాంట్రాక్టర్లకు అధికారులు తొత్తులుగా మారి పని చేస్తున్నారని ధ్వజమెత్తారు. తమ సమస్యలను తక్షణం పరిష్కరించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరిస్తూ వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సంఘం అధ్యక్షుడు ఎర్రిస్వామి, కార్యదర్శి రాము, కోశాధికారి వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్‌లో ఇద్దరికి చోటు


మల్లికార్జున, కాటమయ్య

అనంతపురం అర్బన్: అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ కౌన్సిల్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు దక్కింది. తమిళనాడులోని నాగపట్నంలో మూడు రోజులుగా ఏఐకేఎస్ జాతీయ మహాసభలు జరుగుతున్నాయి. చివరి రోజు గురువారం కౌన్సిల్ జాతీయ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో సభ్యులుగా రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు అన్నగిరి కాటమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జునకు చోటు దక్కింది.

క్రీస్తు త్యాగాలకు ప్రతీక గుడ్ ఫ్రైడే

- సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్న చర్చిలు
- ప్రత్యేక ప్రార్థనలతో యేసుక్రీస్తుపై విశ్వాసం ప్రకటించనున్న క్రైస్తవులు




విద్యుద్దీప కాంతులతో వెలుగులీనుతున్న రామచంద్రానగర్‌లోని కార్మియల్ మాత మందిరం

అనంతపురం కల్చరల్: క్రైస్తవ సమాజంలో అత్యంత ప్రత్యేకమైన రోజుగా పరిగణించబడే గుడ్ ఫ్రైడే రానే వచ్చింది. క్రైస్తవ విశ్వాసం ప్రకారం సమాజంలో నెలకొన్న చెడును తొలగించడానికి ఈ రోజున తన జీవితాన్ని యేసు క్రీస్తు త్యాగం చేశాడు. ఆ త్యాగాలను మననం చేసుకుంటూ ప్రత్యేక ప్రార్థనలతో యేసుక్రీస్తుపై విశ్వాసం ప్రకటించేందుకు క్రైస్తవులు సిద్ధమయ్యారు. క్షమ, కరుణకు ప్రతిరూపంగా నిలిచిన యేసు క్రీస్తు.. లోకంలో పాపులను పరిశుద్ధులను చేసే క్రమంలో సిలువపై రక్తం చిందించిన దైవ కుమారుడిగా మరణించి కూడా పునరుత్థానుడై లేచిన సంఘటన ప్రపంచ చరిత్రలో మరెక్కడా కనిపించదు. ఆ ఘట్టాలను వివరించే గుడ్ ఫ్రైడే నుంచి ఆదివారం వచ్చే ఈస్టర్ పర్వదినం వరకు సాగే వేడుకలకు జిల్లాలోని ప్రతి ప్రార్థనామందిరాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి.

నేనే మార్గం – నేనే జీవం

పాపులను పరిశుద్ధులను చేసేందుకు కరుణామయుడైన క్రీస్తు సిలువనెక్కిన రోజున గుడ్ ఫ్రైడేగా జరుపుకుంటున్నట్లు పలువురు పాస్టర్లు తమ సందేశాలలో చెపుతున్నారు. నేనే మార్గం.. నేనే జీవం అని సమస్త మానవాళిలో స్థైర్యం నింపుతూ యేసయ్య చిరునవ్వుతో తన దేహాన్ని బలిదానంగా అర్పించిన రోజు శుభ శుక్రవారంగా మారిందని, ఉపవాసాలతోనే ఆయనను మెప్పించాలని పేర్కొన్నారు.

ముస్తాబైన చర్చిలు

సాధారణంగా ఇతర పండుగలకు భిన్నంగా గుడ్‌ఫ్రైడే ఆనందోత్సాహాలతో కాకుండా క్రీస్తు త్యాగానికి ప్రతీకగా కనపడుతుంది. కాబట్టే ఈ దినాల నాడు ఉపవాసాలుండడం ఆనవాయితీగా వస్తోంది. క్రీస్తు చివరిసారి సిలువపై పలికిన ఏడు వ్యాక్యాలు ప్రార్థనామందిరాలలో ఇప్పటికే ప్రతిధ్వనిస్తున్నాయి. అనంతలోని పురాతన మందిరాలైన సీఎస్ఐ చర్చిలో పెద్ద ఎత్తున క్రైస్తవులతో రెవరెండ్ బెనహర్‌బాబు నేతృత్వంలో సామూహిక ప్రార్థనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. మరో ప్రాచీన ప్రార్థనామందిం ఎస్ఐయూ చర్చిలో బెంగళూరు నుంచి విచ్చేసే అంతర్జాతీయ సువార్తీకులు స్టీఫెన్ బాబ్, సంఘ కాపరి పాస్టర్ సంపత్‌కుమార్‌తో కలసి వల్యక్యోపదేశం చేయనున్నారు. రామచంద్ర నగర్‌లోని కార్మియల్ మాత మందిరంలో క్రీస్తు జీవితాన్ని సజీవంగా ఆవిష్కరించే లఘు నాటికను ప్రదర్శించనున్నారు. కోర్టురోడ్డు, గుల్జార్‌పేట్‌లోని గాస్పెల్ హాల్, కళాకారుల కాలనీలోని రేమా చర్చి సామూహిక ప్రార్థనలకు సిద్ధమయ్యాయి. క్రీస్తు సిలువపై పలికిన చివరి మాటల ప్రాశస్త్యాన్ని తెలుసుకోవడానికి ప్రార్థనల్లో విరివిగా పాల్గొనాలని పాస్టర్లు పిలుపునిచ్చారు.

విశ్వాసముంచితేనే నిత్య జీవము



'ఎదుటి వారి కష్టాలను పంచుకోవడంలోనే శాంతి దాగుంది' అనే పరమ సత్యాన్ని చాటడానికే క్రీస్తు సిలువనెక్కి రక్షకుడయ్యాడు. ఆయన పరిశుద్ధుడు, ఏ పాపము చేయనివాడు కనుకనే తనకు తానే సిలువకు అప్పగించుకున్నాడు. మనుష్యుల పట్ల అవ్యాజ్యమైన ప్రేమ, త్యాగము క్రీస్తు జీవితంలో మాత్రమే చూడగలం. విశ్వాసముంచితేనే నిత్య జీవము అనే క్రీస్తు బోధనల సారమే గుడ్‌ఫ్రైడే పర్వదినం. గుల్జార్‌పేట్‌లోని గాస్పెల్ అసెంబ్లీ హాలులో జరిగే ప్రత్యేక ప్రార్థనల్లో అందరూ పాల్గొనండి.
– ఫిలిఫ్, దైవజనులు

యువకుడి బలవన్మరణం

రాయదుర్గం టౌన్: వ్యసనాలు మానుకుని బుద్ధిగా జీవించాలంటూ తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు.. రాయదుర్గంలోని శాంతినగర్ కాలనీలో నివాసముంటున్న వెంకటేశులు కుమారుడు దాసరి రవి(24) గార్మెంట్స్ పరిశ్రమలో పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో తాగుడు, ఇతర వ్యసనాలకు బానిసయ్యాడు. పలుమార్లు తల్లిదండ్రులు మందలించినా మార్పు రాలేదు. రెండు రోజుల క్రితం తీవ్ర స్థాయిలో మందలించడంతో ఇల్లు విడిచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి అతని ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం ఉదయం స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని హనుమంతప్ప కుంటలో మృతదేహం తేలియాడుతుండడంతో సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని వెలికితీశారు. విషయం తెలుసుకున్న వెంకటేశులు కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని మృతుడిని రవిగా నిర్ధారించి, బోరున విలపించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ జయానాయక్ తెలిపారు.

తలపై రాయిపడి యువకుడి మృతి

కళ్యాణదుర్గం రూరల్: నిద్రిస్తున్న యువకుడి తలపై రాయిపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కళ్యాణదుర్గం మండలం మల్లాపురంలో ఈ ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వేణు, సునందమ్మ దంపతులు కరూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. బుధవారం రాత్రి భోజనం ముగించుకున్న అనంతరం ఇంటి ఆవరణలో నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి సమయంలో మిద్దెపై నుంచి ప్రమాదవశాత్తు రాయి నిద్రిస్తున్న వేణు తలపై పడడంతో తీవ్ర గాయమైంది. భార్య గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని వెంటనే స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. అధిక రక్తస్రావంతో అప్పటికే వేణు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య


జావేద్ (ఫైల్)

గుంతకల్లు: బీటెక్‌లో ఒక సబ్జెక్ట్ తప్పడంతో మనస్తాపం చెంది ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... కూడేరుకు చెందిన జాఫర్‌వలి కుమారుడు పి.మహమ్మద్ జావేద్ (18) గుత్తిలోని గేట్స్ కళాశాలలో బీటెక్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. గుంతకల్లులోని ద్వారాక నగర్‌లో నివాసముంటున్న బంధువుల ఇంట్లో ఉంటూ రోజూ కళాశాలకు వెళ్లి వచ్చేవాడు. ఇటీవల విడుదలైన ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో ఒక సబ్జెక్టు ఫెయిల్ అయినట్లుగా గుర్తించి మానసికంగా కుదేలయ్యాడు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం 7 గంటలకు బయటకు వచ్చిన జావేద్ రాత్రి 9 గంటలవుతున్నా ఇంటికి చేరుకోలేదు. ఎన్ని సార్లు ఫోన్ చేసిన జావేద్ లిఫ్ట్ చేయకపోవడంతో వెంటనే కుటుంబసభ్యులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు జావేద్ సెల్‌ఫోన్ లోకేషన్ ఆధారంగా తిమ్మనచెర్ల రైల్వేస్టేషన్ సమీపంలో చేరుకుని పరిశీలించగా పట్టాలపై రెండుగా విడిపోయిన జావేద్ శరీర భాగాలు కనిపించాయి. ఘటనపై జీఆర్పీ ఎస్‌ఐ మహేంద్ర కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువకుడి దుర్మరణం


సుమంత్ మృతదేహం

పామిడి: అతి వేగం ఓ యువకుడి ప్రాణాలను బలిగొంది. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురంలోని అశోక్‌నగర్‌కు చెందిన శివకుమార్ కుమారుడు సుమంత్ (25) వ్యక్తిగత పనిపై గురువారం ఉదయం గుంతకల్లుకు వెళ్లాడు. పని ముగించుకున్న అనంతరం ద్విచక్రవాహనంపై తిరుగు ప్రయాణమైన ఆయన.. పామిడి గ్రామ పరిధిలోని 44వ జాతీయ రహదారిపై అయ్యప్ప స్వామి ఆలయం వద్దకు చేరుకోగానే వేగాన్ని నియంత్రించుకోలేక నేరుగా వెళ్లి కల్వర్టు రక్షణ గోడను ఢీకొన్నాడు. ఘటనలో సుమంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జయింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడి వద్ద లభ్యమైన ఆధారాలను బట్టి సమాచారం ఇవ్వడంతో తల్లిదండ్రులు ఆస్పత్రికి చేరుకుని కుమారుడి మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఏడుగురు క్రికెట్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్

- 4.20 లక్షలు నగదు, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం


అరెస్ట్ అయిన క్రికెట్ బెట్టింగ్ రాయుళ్లను చూపుతున్న పోలీసులు

తాడిపత్రి టౌన్: క్రికెట్ బెట్టింగ్ పాల్పడుతున్న ఏడుగురిని గురువారం తాడిపత్రి పోలీసులు అరెస్టు చేశారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ రోహిత్‌కుమార్ వివరాలు వెల్లడించారు. పట్టణ శివారులోని రజక కల్యాణ మంటపం వద్ద 'ఏస్ టేకింగ్' క్రికెట్ బెట్టింగ్ యాప్ ఏజెంట్ మకందర్ సంధానీ తచ్చాడుతుండగా... అనుమానంతో ఎస్ఐ గౌస్‌బాషా అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. ఈజీ మనీ కోసం సెల్‌ఫోన్లలో మట్కా, యాప్‌ల ద్వారా క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లుగా నిర్ధారణ కావడంతో అతను ఇచ్చిన సమాచారం మేరకు అతని స్నేహితులు బలపనూర్ షబ్బీర్, మకందర్ జిలానీ, మకందర్ మహబూబ్‌బాషా, డోంగ్రీ హరూన్, పోస నరేష్ బాబు, షేక్ ముజీబ్, పామిడి మహమ్మద్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.4.20 లక్షలు నగదుతో పాటు 10 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

అందరూ జేసీ అనుచరులే

అరెస్టయిన వారిలో మకందర్ సంధానీ క్రికెట్ బుకీ కాగా, డోంగ్రీ హరూన్ తాడిపత్రిలో హరూన్ మోటార్స్ పేరుతో ఎలక్ట్రికల్ బైక్‌లు విక్రయిస్తున్నాడు. అతనికి పార్టనర్‌గా మకందర్ జిలానీ ఉన్నారు. హరూన్ మోటార్స్‌లో డ్రైవర్‌గా షేక్ ముజీబ్ పనిచేస్తున్నాడు. హరూన్‌కు బలపనూర్ షబ్బీర్ స్నేహితుడు. పామిడి మహమ్మద్ మెడికల్ ఏజెన్సీ నిర్వహిస్తున్నాడు. ఇతనికి పోస నరేష్‌బాబు స్నేహితుడు. వీరంతా స్థానిక మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అనుచరులే కావడం గమనార్హం.

అశ్వవాహనంపై చౌడేశ్వరీదేవి



అమడగూరు: మండల కేంద్రంలో చౌడేశ్వరీదేవి ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. చౌడేశ్వరమ్మను బెల్లీరథంలో పురవీధుల్లో ఊరేగించారు. ధగ ధగ మెరిసే నగలు, పట్టు వస్త్రాలతో అభయమిస్తున్నట్లు కనిపిస్తున్న చౌడేశ్వరిని దర్శించుకుని ఎంతో మంది భక్తులు పునీతులయ్యారు. కాగా ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన దుకాణాలన్నీ మహిళలు, చిన్న పిల్లలతో కళకళలాడాయి. శనివారం అమ్మవారు సింహవాహనంపై దర్శనమివ్వనున్నట్లు ఆలయ ధర్మకర్త పాట్బా పురుషోత్తమరెడ్డి పేర్కొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో అన్నదమ్ముల మృతి

- నీటి మడుగులో ఒకరు.. రోడ్డు ప్రమాదంలో మరొకరు
- దొరిగిల్లులో విషాదం


రమణయ్య (ఫైల్)

ముదిగుబ్బ: ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు వేర్వేరు ప్రమాదాల్లో చనిపోయారు. దీంతో దొరిగిల్లు క్వార్టర్స్‌లో విషాదఛాయలు అలముకున్నాయి. స్థానికుల వివరాల మేరకు.. దొరిగిల్లుకు చెందిన రమణయ్య (46) బుధవారం వ్యవసాయ పనులకు వెళ్లి పనులు ముగిసిన తరువాత స్నానం చేసేందుకు తోట సమీపంలోని గుర్రాల మడుగులోకి వెళ్లినట్లుగా తెలుస్తోంది. ప్రమాదవశాత్తూ నీట మునిగి మృతి చెందినట్లు స్థానికులు అనుమానాలు వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు.

రోడ్డు ప్రమాదంలో తమ్ముడు..

నాలుగు రోజుల క్రితం రమణయ్య సోదరుడు మునికృష్ణ (45) మొలకలచెరువు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఒకే రోజు అన్నదమ్ములిద్దరూ చనిపోవడంతో దొరిగిల్లులో విషాదఛాయలు అలముకున్నాయి. రమణయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అలాగే మునికృష్ణ భార్య ఇప్పటికే చనిపోగా ఓ కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు సీఐ శివరాముడు తెలిపారు.

క్లుప్తంగా

రేపు రన్ ఫర్ జీసెస్

అనంతపురం కల్చరల్: సిలువపై మరణించి మూడవ రోజున పునరుత్థానుడైన క్రీస్తును ఘనపరుస్తూ ఈనెల 19న ఉదయం 6 గంటలకు రన్ ఫర్ జీసెస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రెవరెండ్ మోజెస్ అనిల్‌కుమార్, పాస్టర్ సంపత్‌కుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక ఎస్‌ఐయూ చర్చిలో రన్ ఫర్ జీసెస్ ఫ్లెక్సీలు, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అరవింద నగర్‌లోని జీసెస్ కంపాషన్ చర్చి వద్ద ప్రత్యేక ప్రార్థనలతో రన్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కోర్టు రోడ్డు, టవర్‌క్లాక్ మీదుగా ఎస్‌ఐయూ చర్చి వరకు సాగే ఆధ్యాత్మిక పరుగులో అన్ని క్రైస్తవ సంఘాల ప్రతినిధులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చీఫ్ కన్వీనర్ జాన్ వెస్లీ, రెవరెండ్ యేసయ్య, రెవరెండ్ నెహమ్యా, పాస్టర్లు ఆనంద్, మనుష్యే, ఆదినారాయణ, సోలోమోను, జాకబ్, జీవన్, లాభాను, చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

ఆత్మకూరు: మండలంలోని ముట్టాల గ్రామంలో గురువారం విజిలెన్స్ అధికారులు అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఓ ఇంట్లో అక్రమంగా 21 బస్తాల్లో నిల్వ ఉంచిన 9 కింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ సీఐ జమాల్‌బాషా తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ లక్ష్మీదేవి, వీఆర్వో రఫి పాల్గొన్నారు.

'ప్రాథమిక తరగతుల విలీనం సరికాదు'

అనంతపురం ఎడ్యుకేషన్: ఉన్నత పాఠశాలల్లో ప్రాథమిక తరగతులను విలీనం చేయడం సబబుకాదని ఏపీటీఎఫ్ (1938) జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస నాయక్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 900 ఉన్నత పాఠశాల్లో 3, 4, 5 తరగతులను అలానే కొనసాగించాలని.. అంతటితో ఆగకుండా 1, 2 తరగతులకు కూడా హైస్కూళ్లలో విలీనం చేస్తామని అధికారులు చెబుతున్నారన్నారు. 117 జీఓ పూర్తిగా రద్దు చేసి హైస్కూళ్లలోని 3, 4, 5 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లోకి వెనక్కి పంపాలని కోరుతుంటే.. 1, 2 తరగతులను కూడా విలీనం చేయడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా ప్రభుత్వం నిర్వాకం ఉందంటూ మండిపడ్డారు. ఇదే జరిగితే ఇంకో రెండేళ్లల్లో ప్రాథమిక పాఠశాలలు లేకుండా మూతపడే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా 3, 4, 5 తరగతులను వెనక్కి పంపాలని కోరారు. 1, 2 తరగతులను ప్రాథమిక పాఠశాలల్లోనే ఉంచాలన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం



ఆశా కార్యకర్తకు నగదు అందజేస్తున్న వైద్య సిబ్బంది

రాప్తాడు: ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్ సచివాలయంలో ఆశాగా విధులు నిర్వహిస్తున్న వీరమ్మ కుటుంబానికి వైద్యాధికారి శివకృష్ణ, వైద్య సిబ్బంది గురువారం రూ.26,500 ఆర్థిక సాయం అందించారు. మూడు నెలల క్రితం వీరమ్మ కుమార్తె మహిమా రాణికి పచ్చకామెర్లు అయ్యాయి. పచ్చకామెర్లకు వైద్యం కూడా చేయించారు. మళ్లీ రెండు నెలల క్రితం జ్వరం వచ్చి మెదడుకు సంబంధించిన జబ్బు రావడంతో అనంతపురంలో పలు ఆస్పత్రుల్లో చూపించారు. అయినా ఆమెకు ఆరోగ్యం కుదుట పడకపోవడంతో ఇక్కడి వైద్యులు మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు రెఫర్ చేశారు. రెండు నెలల నుంచి బెంగళూరులో ఉంటూ వైద్యం చేయిస్తున్నారు. వీరమ్మ పరిస్థితిని తెలుసుకున్న వైద్యాధికారి శివకృష్ణ, తోటి వైద్య సిబ్బంది రూ.26,500 వసూలు చేశారు. గురువారం ఆమెకు ఆ మొత్తాన్ని అందజేశారు.

'మా ప్రాంతంలో డంపింగ్ యార్డ్ వద్దు'

రాప్తాడురూరల్: అనంతపురం నగరపాలక సంస్థకు చెందిన డంపింగ్ యార్డు మా ప్రాంతంలో పెట్టొద్దని అనంతపురం రూరల్ మండలం నరసనాయనికుంట ప్రజలు కోరారు. కలెక్టర్ వినోద్‌కుమార్‌తో పాటు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. నరసనాయనికుంట గ్రామం 263 (పాత సర్వే నంబరు-1) లో డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసిందన్నారు. ఈ డంపింగ్ స్థలం నరసనాయనికుంట గ్రామానికి కేవలం 100 మీటర్లు, నాగిరెడ్డిపల్లి గ్రామానికి 1000 మీటర్ల దూరంలో ఉందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, మలిన పదార్థాలను డంపింగ్ చేయడం వలన దుర్వాసన, పొగ, కాలుష్యం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతారని తెలిపారు. అలాగే వ్యవసాయ పంటలు, పాడిపశువులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే సమీపంలోని సిప్లాన్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే దుర్వాసన వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు.



నాయక్‌నగర్‌లో పైప్‌లైన్ పనులు విఫలం కావడంతో మరోసారి రోడ్లను ధ్వంసం చేసిన దృశ్యం



పెచ్చులు పెచ్చులుగా లేచిన సీసీ రోడ్డు

ఆగని రోడ్ల ధ్వంసం..!

- రూ.లక్షలతో వేసిన బీటీ, సీసీ రోడ్లు ఛిద్రం
- ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- నిద్రమత్తులో నగరపాలక సంస్థ ఇంజినీర్లు

అనంతపురం కార్పొరేషన్: ఏజీ అండ్ పీ ప్రథమ్ కంపెనీ నిర్వాకంతో నగరంలో రోడ్ల ధ్వంసం ఆగడం లేదు. నగరపాలక సంస్థ ఇంజినీర్లు చేతులెత్తేయడంతో సదరు కంపెనీ నిర్వాహకులు పైప్‌లైన్ పేరుతో బీటీ, సీసీ రోడ్లను యథేచ్ఛగా ఛిద్రం చేస్తున్నారు. దీంతో రానున్న రోజుల్లో నగరపాలక సంస్థకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లనుంది. పునరుద్ధరణ పనులు చేయకుండా రోడ్లు ధ్వసం చేసిన అనంతరం జేసీబీతో మట్టిని కప్పి పత్తా లేకుండా పోతున్నారు.

వృథా అవుతున్న ప్రజాధనం..

నగరంలోని అరవింద నగర్, కృపానంద నగర్‌లో ఉన్న బీటీ రోడ్డును ఏజీ అండ్ పీ ప్రథమ్ కంపెనీ నిర్వాహకులు ధ్వంసం చేశారు. రూ.లక్షల ప్రజాధనంతో చేపట్టిన రోడ్లను పైప్‌లైన్ పనుల పేరుతో డ్రిల్ చేస్తున్నారు. పేరుకు మాత్రం ఒకవైపు తవ్వుతున్నట్లు చెబుతున్నా.. హై గేజ్ కలిగిన పరికరాలతో రోడ్లను డ్రిల్ చేయడంతో ఆ ప్రాంతంలో భూమి అదురుతోంది. తద్వారా రానున్న రోజుల్లో వర్షాలు వస్తే రోడ్లు గుంతలు పడి పూర్తిగా దెబ్బతినే అవకాశం లేకపోలేదు. అదే విధంగా నాయక్ నగర్‌లో గత నెలలో పైప్‌లైన్ పనుల పేరుతో సీసీ రోడ్డును తవ్వేశారు. ఈ విషయంపై సాక్షిలో కథనం రావడంతో అప్రమత్తమైన కంపెనీ సిబ్బంది అప్పటికప్పుడు మట్టిని కప్పేశారు. తీరా అక్కడ చేపట్టిన పైప్‌లైన్ పనులు ఫెయిల్యూర్ అయ్యాయి. దీంతో నాయక్‌నగర్ నుంచి ఆదర్శ నగర్‌కు వెళ్లే మార్గంలో మరోసారి రోడ్డును ఛిద్రం చేశారు. సీసీ రోడ్డు పెచ్చులు పెచ్చులుపై పైకి లేచింది. గ్యాస్ పైప్‌లైన్ పనుల పేరుతో రోడ్లన్నీ తవ్వేస్తున్నా.. నగరపాలక సంస్థ ఇంజినీర్లు అటువైపు చూడటం లేదు. ఇంజినీర్ల పర్యవేక్షణలో పనులు చేపడితే బాగుంటుందని నగరవాసులు చెబుతున్నారు. కానీ నగరపాలక సంస్థలోని వివిధ విభాగాల ఇంజినీర్లు క్షేత్రస్థాయి పర్యటన పేరుతో పత్తా లేకుండా పోతున్నారు. అదే ప్రజాప్రతినిధులు పిలిస్తే ఆగమేఘాలపై వారి దగ్గరికి వెళ్తున్నారు.



కృపానంద నగర్‌లో బీటీ రోడ్డుకు కోత పెట్టిన దృశ్యం



అరవిందనగర్‌లో బీటీ రోడ్డుకు ఆనుకుని తీసిన గుంతలు

విపరీతమైన శబ్దం..

ఏజీ అండ్ పీ ప్రథమ్ చేపడుతున్న గ్యాస్ పైప్‌లైన్ పనుల ద్వారా విపరీతమైన సౌండ్ పొల్యూషన్ (శబ్ధ కాలుష్యం) వస్తోంది. ఉదయం నుంచి రాత్రి వరకూ షిఫ్టుల ప్రకారం పనులు జరుగుతున్నాయి. దీంతో పెద్ద పెద్ద శబ్దాలు వస్తుండటంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

గ్యాస్ పైప్‌లైన్ పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. ఇప్పటికే సంబంధిత కంపెనీ నిర్వాహకులతో చర్చించాం. దెబ్బతిన్న రోడ్లను వారే ఏర్పాటు చేయాలి. మరోసారి సమావేశం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. నగర ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం. – చంద్రశేఖర్, ఎస్‌ఈ, నగరపాలక సంస్థ

నగరంలో తాగునీటి ఎద్దడి

- ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడంలో ఇంజినీర్ల విఫలం
- మున్నానగర్, అంబేడ్కర్ నగర్, మారుతీ నగర్‌లో నీటి సమస్య

అనంతపురం కార్పొరేషన్: నగరంలో నీటి ఎద్దడి మొదలైంది. నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగం ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నగరంలోని 21వ డివిజన్‌లోని అంబేడ్కర్ నగర్, మున్నానగర్, 35వ డివిజన్‌లోని మారుతీ నగర్‌లో గత కొన్ని రోజులుగా నీటి సమస్య వెంటాడుతోంది. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడంలో నగరపాలక సంస్థ అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

15 రోజులుగా నీటి సమస్య

స్థానిక అంబేడ్కర్ నగర్, మున్నానగర్ మురికివాడలు. గతంలో వేసవి కాలంలోనూ ఎప్పుడు నీటి సమస్య రాలేదు. కూటమి ప్రభుత్వంలో పెద్ద ఎత్తున నీటి సమస్య నెలకొంది. గత పదిహేను రోజులుగా నీరు పూర్తి స్థాయిలో రావడం లేదు. దీంతో ఆ ప్రాంతాల్లో పని చేస్తున్న బోర్ల నుంచి నీరు తెచ్చుకుంటున్నారు. అదే విధంగా మినరల్ వాటర్‌ను కొనుగోలు చేసి తాగుతున్నారు. మారుతీ నగర్‌లోనూ ఇదే సమస్య తలెత్తుతోంది. బుడ్డప్ప నగర్‌లోని ట్యాంక్‌కు నీరు పూర్తిగా రాకపోవడం కారణంగా అంబేడ్కర్ నగర్, మున్నా నగర్‌కు నీరు సరఫరా కావడం లేదని ఇంజినీరింగ్ సిబ్బంది చెబుతున్నారు. కానీ నగరపాలక సంస్థ ఇంజినీర్లు మాత్రం స్టార్టర్ సమస్యతో నీటి జాప్యం జరుగుతోందంటూ పొంతన లేని సమాధానం ఇస్తున్నారు.



ఇంజినీర్‌కు నీటి సమస్యను తెలియజేస్తున్న మహిళ

మేయర్, కమిషనర్లకు ఫిర్యాదు

నీటి సమస్యపై 21వ డివిజన్ కార్పొరేటర్ సాకే చంద్రలేఖ గురువారం మేయర్ వసీం, కమిషనర్ బాలస్వామికి ఫిర్యాదు చేశారు. దీంతో వారు స్పందించి ఇంజినీరింగ్ అధికారులను అప్రమత్తం చేశారు. దీంతో డీఈ సత్యనారాయణ, ఏఈ రాజశేఖర్ రెడ్డి అంబేడ్కర్ నగర్, మున్నా నగర్‌లో పర్యటించారు. నీటి సమస్య ఎన్ని రోజుల నుంచి ఉందని స్థానికులను ప్రశ్నించారు. నీరు సరిగా రావడం లేదని.. వేసవిలో ఎక్కడి నుంచి నీరు తెచ్చుకోవాలని వారు అధికారులను నిలదీశారు. ఇంజినీర్ల వెంట వైఎస్సార్‌సీపీ నాయకుడు సాకే కుళ్లాయస్వామి తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్య తలెత్తనీయొద్దు

అనంతపురం కార్పొరేషన్: నగరంలో ఎక్కడ కూడా తాగునీటి సమస్య తలెత్తనీయొద్దు. ఇందుకోసం ముందస్తు చర్యలు తీసుకోవాలని మేయర్ వసీం ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థలో ఇంజినీర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లీకేజీలు లేకుండా పైప్‌లైన్లను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. మోటర్ల సమస్య తలెత్తినా ఎటువంటి ఇబ్బంది లేకుండా స్టాండ్ బై మోటర్‌ను సిద్ధంగా ఉంచాలన్నారు. స్టోరేజ్ ట్యాంక్‌లో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని సూచించారు. వేసవి ముగిసే వరకు అధికారులంతా సమన్వయంతో పని చేయాల్సి ఉందన్నారు. పైప్‌ల ద్వారా అన్ని ప్రాంతాలకు తాగు నీరు సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలో అవసరమైన ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు.



ఇంజినీర్లతో సమావేశమైన మేయర్ వసీం

డంపింగ్ యార్డులో చెత్త ఎక్కువగా ఉందని.. సాధ్యమైనంత త్వరగా తరలించేలా చూడాలన్నారు. చెత్త ట్రాక్టర్ల సక్రమంగా రావడం లేదని ఫిర్యాదులు వస్తున్నట్లు తెలిపారు. ఆరో రోడ్డులో లైట్లు వెలగడం లేదని ఫిర్యాదులున్నాయని, ఆ సమస్యను పరిష్కరించారు. సమావేశంలో ఎస్‌ఈ చంద్రశేఖర్, ఈఈలు షాకీర్, నరసింహ, డీఈ సతీష్, ఏఈ రాజశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆరు చాప్టర్లతో వార్షిక పరీక్షలు


- నగరంలోని 15వ వార్డు ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వాకం
- లబోదిబోమంటున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

అనంతపురం ఎడ్యుకేషన్: సబ్జెక్టుల్లో అన్ని పాఠాలు (చాప్టర్లు) పూర్తి చేసి వార్షిక పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలి. అయితే నగరంలో 15వ వార్డు ప్రాథమికోన్నత పాఠశాలలో సగం చాప్టర్లతోనే వార్షిక పరీక్షలు పెట్టి మమ అనిపించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల వివరాల మేరకు.. 7వ తరగతి గణితంలో 12 చాప్టర్లు ఉండగా.. కేవలం ఆరు మాత్రమే పూర్తి చేసి వార్షిక పరీక్షలు రాయించారు. ప్రభుత్వ స్కూళ్లలో చదువులు బాగా చెబుతున్నారనే ఉద్దేశంతో తన కూతురిని ప్రైవేట్ స్కూల్ నుంచి ఇక్కడ చేర్పించానని 7వ తరగతి విద్యార్థిని తండ్రి ఎండీ ఫార్మనుల్లా వాపోయారు. ఇక్కడ మాత్రం సబ్జెక్టు టీచర్లు కూడా లేరని ఆవేదన వ్యక్తం చేశారు. టీచర్ల సర్దుబాటును ఆలస్యంగా చేయడం వల్ల సబ్జెక్టులు పూర్తిగా బోధించలేదన్నారు. సిలబస్ పూర్తి చేయకపోతే వార్షిక పరీక్షలు ఎలా రాయిస్తారని ప్రశ్నించారు. టీచర్ల కొరతపై తాను గతేడాది విద్యాశాఖ అధికారితో పాటు రాష్ట్రస్థాయి అధికారులకు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశానన్నారు. 7వ తరగతి గణితం సబ్జెక్టులో ఆరు చాప్టర్లు మాత్రమే చెప్పారని.. తక్కిన చాప్టర్లు ఎప్పుడు చెబుతారని కొద్ది రోజుల కిందటే తాను హెచ్‌ఎం దృష్టికి తీసుకెళ్లానని చెబుతున్నాడు. ఆయన అదిగో.. ఇదిగో పూర్తి చేయిస్తామంటూ చెప్పారన్నారు. చివరకు పరీక్షల నాటికి కూడా పూర్తి చేయలేదన్నారు.

సారోళ్లు ఎక్కడికి వెళ్లారో?

- విధులకు డుమ్మా కొడుతున్న సచివాలయ సిబ్బంది

రాప్తాడు: గ్రామ సచివాలయ ఉద్యోగులు ప్రతి రోజూ విధులకు హాజరై ప్రజల సమస్యలు పరిష్కరించాలి. అయితే జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలోని రాప్తాడు గ్రామ సచివాలయం-2లో గురువారం మధ్యాహ్నం ఒక మహిళా అధికారి మాత్రమే విధుల్లో ఉన్నారు. మిగతా ఉద్యోగులు మధ్యాహ్నం తమ విధులకు డుమ్మా కొట్టారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో సచివాలయంలో మహిళ పోలీసు రాజేశ్వరి మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మిగిలిన 9 శాఖల సిబ్బంది ఎక్కడికి వెళ్లారో ఎవరికి తెలియడం లేదు. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలు అధికారులు ఎవరూ కార్యాలయంలో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అధికారులు అందుబాటులో ఉండేవారని.. ఈ ప్రభుత్వంలో ఎవరూ అందుబాటులో ఉండటం లేదని మండిపడుతున్నారు. ఈనెల 18 గుడ్ ఫ్రై డే కావడంతో ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు. సెలవు అయినప్పటికీ ఒక అధికారి 18వ తేదీన కూడా విధులకు హాజరైనట్లు 17వ తేదీన సంతకం చేయడం విడ్డూరంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సచివాలయ సిబ్బంది అందరూ విధులకు హాజరయ్యేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.



రాప్తాడు సచివాలయం-2లో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

సంక్షిప్త సమాచారం

ఎస్కేయూ అధ్యాపకురాలికి అభినందన

అనంతపురం: ఎస్కేయూ ఇంజినీరింగ్ కళాశాలలోని ఈసీఈ విభాగంలో అధ్యాపకురాలిగా పని చేస్తున్న డాక్టర్ కే.పూజిత సంగీత వాయిద్య ప్రదర్శనలో గిన్నిస్ బుక్‌ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం దక్కించుకున్నారు. హైదరాబాద్‌లోని హలేలు మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకుడు ఆగస్టీన్ దండింగి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గిన్నిస్ బుక్ రికార్డు సాధనలో 1,090 మంది పాల్గొనగా 1,049 మంది గిన్నిస్ రికార్డు అందుకున్నారు. ఈనెల 14వ తేదీన హైదరాబాద్‌లో పూజిత పురస్కారం అందుకున్నారు. గురువారం ఎస్కేయూ ఇన్‌చార్జి వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్ బాబు, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రామచంద్ర తదితరులు పూజితను అభినందించారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

అనంతపురం: హెరాల్డ్ కేసును కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పూర్తిగా రాజకీయ పరమైన లక్ష్యాలతో వాడుకుంటోంది. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీలపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని ఎన్‌ఎస్‌యూఐ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్కేయూ ప్రధాన ద్వారం వద్ద గురువారం నిరసన తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ చేతిలో సీబీఐ, ఈడీ కీలుబొమ్మగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీకి వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేక బీజేపీ అక్రమ కేసులు పెడుతూ కక్షసాధింపు చర్యలకు దిగుతోందని విమర్శించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధికార ప్రతినిధి పులిరాజు, శంకర్, నాగేంద్ర, ప్రభాకర్, మహేష్, చంద్ర, మారెన్న, రంజిత్, ముని, చిన్నబాబు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ పేరుతో ఫేస్‌బుక్‌లో నకిలీ ఖాతా

అనంతపురం: అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేరుతో ఫేస్‌బుక్‌లో నకిలీ ఖాతాను తెరిచారు. సైబర్ నేరగాళ్లు కలెక్టర్ ఫొటోను డీపీగా పెట్టి మెసేజ్ ద్వారా డబ్బులు అడిగిన ఘటన చోటు చేసుకుంది. ఈ అంశాన్ని పసిగట్టిన జిల్లా కలెక్టర్ తన పేరు మీద ఉండే నకిలీ ఖాతాపై అప్రమత్తంగా ఉండాలని బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇలాగే మెతకవైఖరి అవలంభిస్తే సైబర్ నేరగాళ్లు పునరావృతం చేస్తారనే ఉద్దేశంతో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సైబర్ నేరగాళ్లను కఠినంగా శిక్షించాలని జిల్లా ఏఓ అలెగ్జాండర్ కోరారు.

సామాజిక స్పృహతోనే వృత్తిలో రాణింపు

అనంతపురం: సామాజిక స్పృహతోనే వృత్తిలో రాణిస్తామని ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీ సుబ్బారెడ్డి అన్నారు. జేఎన్‌టీయూఏ-ఓటీపీఆర్ఐలో 2021 బీఫార్మసీ బ్యాచ్ విద్యార్థులకు ఫేర్‌వెల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటీపీఆర్ఐ డైరెక్టర్ మాట్లాడుతూ.. నేటి పోటీ ప్రపంచంలో పోటీతత్వాన్ని ఎదుర్కొగల శక్తి సామర్థ్యాలు, నైపుణ్యాలను విద్యార్థులు కలిగి ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు నూతన అంశాలపై పరిశోధనలు చేస్తూ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ గోపీనాథ్, డిప్యూటీ రిజిస్ట్రార్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

అనంతపురం ఎడ్యుకేషన్: అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో భయపడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి లింగమయ్య సూచించారు. స్థానిక కోర్టు రోడ్డులోని శ్రీ చైతన్య పాఠశాలలో గురువారం అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే పొగ గదుల్లో చిక్కుకున్న వారిని ఏ విధంగా రక్షించాలి? రెస్క్యూ మెథడ్స్ ద్వారా పై అంతస్తుల నుంచి రక్షించే సహాయ చర్యలను వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారులు గోవింద రాజులు, ఎస్.రమేష్ కుమార్ రెడి, ఈరేష్ గౌడ్, ప్రిన్సిపాల్ తబస్సుమ్, ఏఓ గోపాల్, డీన్లు అప్పలనాయుడు, సిరాజుద్దీన్ అకడమిక్ కో-ఆర్డినేటర్ ఇర్షాద్, ప్రైమరీ ఇన్‌చార్జ్ భారతి తదితరులు పాల్గొన్నారు.

అధిక లోడుతో ప్రయాణిస్తే చర్యలు

రాప్తాడు: వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సీఐ శ్రీహర్ష పేర్కొన్నారు. గురువారం రాప్తాడులో 44వ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. అధికలోడు ప్రయాణించే వాహనాదారులకు జరిమానా విధించారు. అధిక లోడుతో వెళ్తున్న బొలెరోను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మాతృశాఖకు డాక్టర్ విష్ణుమూర్తి

- నగరపాలక సంస్థలో ఎంహెచ్‌ఓ పోస్టు ఖాళీ

అనంతపురం కార్పొరేషన్: మాతృ శాఖ అయిన ఆరోగ్యశాఖకు డాక్టర్ విష్ణుమూర్తి వెళ్లారు. నగరపాలక సంస్థలో ఎంహెచ్‌ఓగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ విష్ణుమూర్తి గురువారం రిలీవ్ అయ్యారు. ఈయన్ను పుట్లూరు మెడికల్ ఆఫీసర్‌గా నియమిస్తూ..డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి ఉత్తర్వులు జారీ చేశారు. డెప్యూటేషన్‌పై ఏడాదిగా ఆయన నగరపాలక సంస్థ ఎంహెచ్‌ఓగా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం ఎంహెచ్‌ఓ పోస్టు ఖాళీ అయ్యింది. అత్యంత కీలకమైన పోస్టు కావడంతో ఎవరూ ముందుకు వస్తారో వేచి చూడాలి. గతంలో ఇక్కడ ఎంహెచ్‌ఓగా పని చేసిన డాక్టర్ గంగాధర్ పేరు వినిపిస్తోంది.

నైట్ అలవెన్స్ పెంచాలి

అనంతపురం క్రైం: ఆర్టీసీ కార్మికుల విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు తమను ఆందోళనలోకి నెట్టేశాయని నేషనల్ మజ్దూర్ యూనియన్ నేతలు తెలిపారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపో ముందు పలు డిమాండ్లతో కూడిన ఫ్లకార్డులను పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎన్‌ఎంయూఏ జిల్లా చైర్మన్ వి.సూరిబాబు మాట్లాడుతూ.. నైట్ డ్యూటీ అలవెన్సుల విషయంలో ప్రభుత్వం తమకు తీరని అన్యాయం చేస్తోందని వాపోయారు. రూ.150 నుంచి తక్షణం రూ.400లకు నైట్ డ్యూటీ అలవెన్సు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు డి.ఎన్ రెడ్డి, డిపో కార్యదర్శి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మ్యాథమాటిక్స్ ఒలింపియాడ్‌లో సత్తా



ప్రశంసాపత్రాలు చూపుతున్న విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: యూనిఫైడ్ ఒలింపియాడ్ వారు దేశవ్యాప్తంగా లక్షలాదిమంది విద్యార్థులకు నిర్వహించిన మ్యాథమాటిక్స్ ఒలింపియాడ్ (యూఐఎంఓ) పరీక్షలో నగరంలోని సంగమేష్ నగర్ మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. వందలోపు పలు జాతీయ ర్యాంకులు, స్వర్ణ పతకాలు, నగదు పురస్కారాలు సాధించారు. 4వ తరగతి విద్యార్థిని పి.సౌమ్యశ్రీ జాతీయ స్థాయిలో 4వ ర్యాంకు, 2వ తరగతి ఈ.భవిష్య 5వ ర్యాంకు, ఎస్.నిదఫాతిమా 16వ ర్యాంకు సాధించారు. మొత్తం 26 మంది విద్యార్థులు నేషనల్ అచీవర్స్‌గా గుర్తింపు పొందారు. 10వ తరగతి విద్యార్థి పి.విక్టర్ డేవిడ్ రాజ్ రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించాడని కరస్పాండెంట్ సి.సూర్యనారాయణరెడ్డి తెలిపారు. లాజికల్, ఎనలిటికల్ థింకింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్ తదితర అంశాలపై విద్యార్థులు పట్టు కలిగి ఉండటం వల్ల విజయం సాధించారన్నారు. పాఠశాల కార్యదర్శి కె.మాధవి, ప్రిన్సిపల్ కె.పద్మావతి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

హెల్మెట్ల వితరణ



పోలీసు సిబ్బందికి హెల్మెట్లు అందజేస్తున్న దృశ్యం

అనంతపురం: జిల్లా కేంద్రంలోని మహిళా పోలీస్‌స్టేషన్‌లో డిస్కవరీ అనంతపురం వారి సహకారంతో హెల్మెట్ బ్యాంక్, డీహైడ్రేషన్ బ్యాంక్‌ను ఎస్పీ జగదీష్ గురువారం ప్రారంభించారు. మహిళా, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బందికి 24 హెల్మెట్లు, 300 సర్జికల్ క్లాప్స్, ఫ్రిడ్జ్, కూల్ వాటర్, ఎలెక్ట్రోలైట్, గ్లూకోజ్ బాటిళ్లను డిస్కవరీ అనంతపురం నిర్వాహకుడు అనిల్ ఉచితంగా అందజేశారు. అనంతపురం డీఎస్పీ, అన్ని పోలీస్‌స్టేషన్లలో ఫ్రిడ్జ్‌లు, 15 నుంచి 18 వేల కూల్ వాటర్, ఎలెక్ట్రోలైట్, గ్లూకోజ్ బాటిళ్లు అందజేసేలా డిస్కవరీ అనంతపురం వారు ముందుకు రావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో డిస్కవరీ అనంతపురం నిర్వాహకుడు అనిల్ కుమార్, డీఎస్పీలు మహబూబ్ బాషా, శ్రీనివాస రావు, సీఐ శాంతిలాల్, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

22న వాహనాల వేలం

రాప్తాడు: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన 19 వాహనాలను ఈనెల 22వ తేదీ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వేలం వేస్తున్నట్లు సీఐ శ్రీహర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో వాహనాలను కొన్నవారు వాహనాలను గుజిరీకి మాత్రమే వేసుకోవాలన్నారు.